ఆంధ్రప్రభ
Estd. 1938
Journalism first!

తూర్పు గోదావరి
EAST GODAVARI

శుక్రవారం 23, ఫిబ్రవరి 2018




- దేశ, విదేశాల్లో పెరిగిన గుర్తింపు
- ప్రతి పనిలోనూ పారదర్శకత
- పిహెచ్‌డి ప్రవేశాలూ కఠినతరం
- మూడోకన్ను పరిధిలోకి వర్శిటీ
- ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్

# జెఎన్‌టియుకె పేరు కాదు.. బ్రాండ్



**(కాకినాడ, ఆంధ్రప్రభ ప్రతినిధి)** : కళాశాలగానే జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన కాకినాడ జెఎన్‌టియు వర్శిటీగా అప్‌గ్రేడ్ అయిన తర్వాత విదేశాల్లో సైతం ప్రత్యేక గుర్తింపు పొందిందని వర్శిటీ ఉపకులపతి ప్రొఫెసర్ విఎస్ఎస్ కుమార్ పేర్కొన్నారు. ఇప్పుడదాక బ్రాండ్‌గా రూపొందిందన్నారు. జెఎన్‌టియు కాకినాడ వర్శిటీ నుంచి పొందే సర్టిఫికెట్‌కు విదేశాల్లో సైతం ప్రాధాన్యత పెరిగింద్నారు. గురువారం వర్సిటీ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటు కళాశాలలు కూడా జెఎన్‌టియుకెకు అనుబంధంగా ఉండేందుకు ఆసక్తి చూపుతున్నాయని పేర్కొన్నారు. ఆంధ్రాయూనివర్శిటీ పరిధిలో ఉన్న ప్రైవేటు కళాశాలల్ని నన్నయ్య లేదా జెఎన్‌టియుకెకు అనుబంధంగా మారాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించిందన్నారు. అయితే అత్యధిక కళాశాలల యాజమాన్యం జెఎన్‌టియుకెనే ఎంచుకున్నాయని, పెరిగిన వర్శిటీ ప్రతిష్టకు ఇదే ప్రత్యక్ష ఉదాహరణగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా తన హయాంలో తీసుకున్న చర్యల్ని, చేపట్టిన అభివృద్ధి పనుల్ని విసి వివరించారు.

**సాంకేతిక విద్యలో మార్పులపై చర్చ** : పారిశ్రామికంగా ప్రగతి సాధిస్తుండడంతో సాంకేతిక విద్యకు ప్రాధాన్యత పెరిగిందని కుమార్ పేర్కొన్నారు. ఈ దశలో ఈ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాల్సిన ఆవశ్యకతను గుర్తించామన్నారు. విద్యార్థులకు ఉద్యోగావకాశాలు

- మిగతా 2లో..



## జెఎన్‌టియుకె పేరు కాదు.. బ్రాండ్

పెరిగే విధంగా తీసుకురావాల్సిన మార్పులపై జాతీయస్థాయిలో ఉపకులపతుల సదస్సు నిర్వహించి పలు నిర్ణయాలు తీసుకున్నామన్నారు.

**తీరిన అధ్యాపకుల కొరత** : అధ్యాపకుల కొరతను నివారించేందుకు మ్యాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సును అనుబంధ కళాశాలల్లో నిర్వహిస్తున్నామని విసి కుమార్ వెల్లడించారు.

**జంబ్లింగ్‌తో మాస్ కాపీయింగ్‌కు అడ్డుకట్ట** : ఇంజనీరింగ్ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌పై పలు ఆరోపణలుండేవని కుమార్ పేర్కొన్నారు. వీటన్నింటిని పటాపంచలు చేసేందుకు జంబ్లింగ్ విధానాన్ని అమల్లోకి తెచ్చామన్నారు. తొలుత దీనిపై తీవ్ర వ్యతిరేకతొచ్చిందన్నారు. అయినప్పటికీ తాము ముందుకెళ్ళి మంచి ఫలితాలు సాధించామన్నారు. అయితే పూర్తిగా మహిళలు, 25కిలోమీటర్ల పరిధిలో ఇంజనీరింగ్ కళాశాల్లేని చోట్ల ఈ విధానానికి మినహాయింపు నిచ్చామన్నారు.

**పిహెచ్‌డి ప్రవేశాలు కఠినతరం** : పిహెచ్‌డి ప్రవేశాల్లోనూ అనేక అవకతవకలు చోటు చేసుకునేవని కుమార్ పేర్కొన్నారు. నోటిఫికేషన్ వెలువడినప్పట్నుంచి ఉన్నతాధికారు ల్నుంచి రాజకీయ నాయకుల వరకు తమపై ఒత్తిళ్ళుండేవన్నారు. వీటిని అధిగమించేందుకు నిబంధనల్ని కఠినతరం చేసి పిహెచ్‌డి అభ్యర్థులకు ప్రవేశ పరీక్ష పెట్టామన్నారు. దీంతో పిహెచ్‌డి ప్రవేశాలు పారదర్శకంగా జరుగుతున్నాయని విసి వివరించారు.

**నకిలీ ఫ్యాకల్టీకి చెక్** : అనుబంధ కళాశాలల్లో తనిఖీల సమయంలో ఫ్యాకల్టీలు ఎప్ప టికప్పుడు మారిపోతుండేవారన్నారు. రెండునెలలకోసారి ఇలా ఫ్యాకల్టీని మార్చి యాజ మాన్యాలు చూపిస్తుండేవన్నారు. దీన్ని అరికట్టేందుకు డైరెక్టరేట్ ఆఫ్ అకడమిక్స్ బ ప్లానింగ్ (డిఏపి) ఒక యాప్‌ను రూపొందించి అనుబంధ కళాశాలల అధ్యాపకుల వివరాలను, పాన్, ఆధార్ కార్డుతో సహా పొందుపరుస్తున్నామన్నారు. ఈ వివరాల్ని అందరికీ తెలిసే విధంగా వెబ్‌సైట్‌లో అందుబాటులోఉంచామన్నారు.

పారదర్శకంగా ర్యాటిఫికేషన్ :ర్యాటిఫికేషన్ విధానంలోనూ పారదర్శకత తీసుకొచ్చామ న్నారు. అర్హతల్ని బట్టి అసిస్టెంట్ ప్రొఫెసర్లకు, అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు కల్పిస్తున్నామన్నారు.

**నాలుగోసారి ఎమ్‌సెట్ నిర్వహణ బాధ్యతలు** : ఇంజనీరింగ్, మెడికల్ ప్రవేశాలకు నిర్వహించే ఎమ్‌సెట్ పరీక్షలను ఇప్పటికే మూడుసార్లు జెఎన్‌టియు దిగ్విజయంగా పూర్తి చేసిందన్నారు. దీంతో నాలుగోసారి నిర్వహించే అవకాశం కూడా వర్సిటీకే ఇచ్చారన్నారు. తొలి రెండుసార్లు రాతపూర్వక విధానంలో జరిగితే గతేడాది ఆన్‌లైన్‌లో ఈ పరీక్షను జరిపామన్నారు. ఈ ఏడాది కూడా ఆన్‌లైన్‌లోనే ఉంటుందన్నారు. టిసిఎస్ సహకారంతో ఈ పరీక్ష జరుగుతుందని, 300నుంచి 400కంప్యూటర్లు ఒకే హాల్లో అందుబాటులో ఉంటే కళాశాలల్ని సెంటర్లుగా ఎంపిక చేస్తున్నట్లుచెప్పారు. అంతేగాక పోలీస్ రిక్రూట్‌మెంట్, ఎన్టీఆర్ విద్యోన్నతి, ఏపి ట్రాన్స్‌కో, ఏపి జెన్‌కో మొదలగు పోటీ పరీక్షలను నిర్వహించామన్నారు.

**మూడోకన్ను పరిధిలోకి వర్శిటీ** : జెఎన్‌టియుకెలో ప్రతీ ప్రయోగశాలలోను సిసి కెమెరాలను ఏర్పాటుచేస్తున్నట్లు కుమార్ వివరించారు. ఇటీవల విద్యార్థినిలపై అధ్యాపకుల లైంగిక వేధింపుల నేపథ్యంలో ప్రతి విభాగాంలో వీటిని నెలకొల్పుతున్నామన్నారు. దీంతో ఎక్కడేం జరిగినా వెంటనే తమ దృష్టికొస్తుందన్నారు.

**ఉద్యోగాల్లేని కోర్సులు రద్దు** : ఉద్యోగావకాశాల్లేని కోర్సుల్ని రద్దు చేసినట్లు విసి కుమార్ ప్రకటించారు. హెల్త్‌సైన్స్ వంటి కోర్సులు రద్దయిన వాటిలో ఉన్నాయన్నారు. అలాగే విద్యార్థులు ఆసక్తి చూపని కొన్ని కోర్సులను మూసివేస్తున్నామన్నారు. అదే సమయంలో ఈ కోర్సుల్ని నిర్వహించే సెంటర్లను కూడా మూసేయిస్తున్నామని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో రెక్టార్ ప్రొ.కె.పూర్ణానందం, రిజిస్ట్రార్ ప్రొ.వివి.సుబ్బారావు, ఓఎస్‌డి ప్రొ.కెవి.రమణ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ బ చీఫ్ ఇంజనీర్ ప్రొ.వి.రవీంద్ర, ఆర్‌అండ్‌డి డైరెక్టర్, పిఆర్‌ఓ ప్రొ.సిహెచ్.సాయిబాబు, డిఏపి ప్రొ.సిహెచ్.సత్యనారాయణ, విలేకర్లు తదితరులు పాల్గొన్నారు.